క్లుప్తంగా

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో బీసీ, మహిళారిజర్వేషన్లు పెట్టాలని సీఎం కేసీఆర్ ప్రధానికి లేఖ రాయటాన్ని స్వాగతిస్తున్నామని బీసీసేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో సమావేశంలో మాట్లాడారు. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. నాయకులు శ్రీనివాస్, నిరంజన్, శేఖర్, విజయకుమార్, గోపాల్ పాల్గొన్నారు.

నేడు విశ్వకర్మ జయంతి



బాలానగర్: మండల కేంద్రంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడు మనోహర చారి తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు. బ్రోచర్‌ను ఆవిష్కరించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు మాధవచారి, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఏఐసీసీ అగ్రనాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఇతర జాతీయ నాయకులు పాల్గొంటారని వివరించారు.
భూత్పూర్: కాంగ్రెస్ విజయభేరీ సభకు నాయకులు, కార్యకర్తలు భారీసంఖ్యలో తరలివెళ్లాలని మండల అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు.

కొనసాగిన దీక్ష



మహబూబ్‌నగర్ రూరల్: పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు పోలే బాలయ్య డిమాండ్ చేశారు. శనివారం ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష చేపట్టారు. నాయకులు కేశవులు, శ్రీరాములు, కాన్షీరాం, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.
జడ్చర్ల టౌన్: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దీక్ష శనివారం ఐదవరోజుకు చేరుకొంది. జిల్లా ఇన్‌చార్జ్ బుర్రి సతీష్‌మాదిగ, నాయకులు రాజుమాదిగ, వినోద్ మాదిగ, వాడ్యాల శివ, అంజి, రామస్వామి, రాజేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని మాడల్‌బేసిక్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు ఇంటాక్ సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ చూపినవారికి నగదు బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు నాగేంద్ర స్వామి, చంద్రకుమార్, నారాయణరావు, రమేష్‌చందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు



నవాబుపేట: కేశవరావుపేట ఉపసర్పంచ్ సంతోష్‌తోపాటు వార్డుసభ్యులు ముగ్గురు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అనిరుధ్‌రెడ్డి సమక్షంలో 25 మంది గ్రామస్తులతో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.
రాజాపూర్: బీఆర్‌ఎస్‌తో విసుగు చెందిన నాయకులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని టీపీసీసీ సెక్రెటరీ అనిరుధ్‌రెడ్డి అన్నారు. శనివారం రంగారెడ్డిగూడలో వివిధగ్రామాలకు చెందిన 70 మంది యువకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య, నాయకులు వెంకట్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్‌గా నరేష్‌చారి

పాలమూరు: బీజేపీ జిల్లా విశ్వబ్రాహ్మణ సెల్ కన్వీనర్‌గా వి.నరేష్ చారిని నియమిస్తూ శనివారం పార్టీ అధ్యక్షుడు వీర బ్రహ్మచారి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన బాధ్యతలను నిర్వర్తిస్తానని, పార్టీ బలోపేతం కోసం పని చేస్తానని తెలిపారు.

తిష్టవేసిన సమస్యలు

- వర్షం వచ్చిందంటే గణేష్‌నగర్ జలమయమే
- అటు మెయిన్‌రోడ్డు, ఇటు ఎర్రగుంట నుంచి వరద
- సోఫియా మసీదు వెనుక ప్రాంతంలో పక్కనే రైల్వేట్రాక్

27వ వార్డులో జనాభా: 5,884
ప్రధాన వీధులు: సోఫియా మసీదు వెనుక ప్రాంతం, గణేష్‌నగర్, వల్లభ్‌నగర్, పాషాబౌలి ప్రాంతం



సోఫియా మసీదు వెనుక ప్రాంతంలోని గల్లీలో మట్టి రోడ్డు.. ఆ పక్క నుంచి వెళుతున్న రైలు



ఖాదర్‌ఖాన్ మసీదుకు వెళ్లే దారిలో దెబ్బతిన్న బీటీరోడ్డు

వార్డ్ వాచ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 27వ వార్డులో సమస్యలు తిష్ట వేశాయి. పాత సీసీ, బీటీ రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. సోఫియా మసీదు వెనుక ప్రాంతంలో సుమారు 500 ఇళ్లు రైల్వే ట్రాక్ సమీపంలోనే ఉన్నాయి. సగం వరకే రక్షణ గోడ నిర్మించి వదిలేశారు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో ఇరుకు రోడ్లతో పాటు అన్నీ పాత డ్రెయినేజీలు చిన్నగా ఉండటంతో మురుగు ముందుకు సరిగా వెళ్లడం లేదని వాపోతున్నారు. పారిశుద్ధ్య కార్మికులు సరిగా రారని, కొత్త డ్రెయినేజీలు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైల్వే ట్రాక్ పక్కన ఉన్న మట్టి రోడ్డును సీసీగా మార్చాలని కోరుతున్నారు. వర్షం కురిసిన ప్రతిసారి గణేష్‌నగర్ సగం వరకు జలమయమవుతోంది. ముఖ్యంగా మూడు గల్లీలలో మోకాలు లోతు వరద నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు. ఒకవైపు రాయచూర్ మెయిన్ రోడ్డు నుంచి మరోవైపు ఎర్రకుంట నుంచి వర్షపునీరు పారుతుందన్నారు. ఎన్‌హెచ్- 167 నిర్మాణంలో భాగంగా రోడ్డు ఎత్తు పెరడటంతో పాటు అప్పట్లో ఉన్న పాత మూడు కల్వర్టులు పూడుకుపోయి వర్షపు నీరంతా గల్లీలలో నిల్వ ఉండి పోతోందన్నారు. దీంతో రోడ్లన్నీ దెబ్బతిన్నాయని పేర్కొంటున్నారు. అలాగే ఎర్రకుంటకు అలుగు కానీ, తూము కానీ లేకపోవడంతో అక్కడి నుంచి వరద ఇటువైపు వస్తోందన్నారు. ప్రధానమైన ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. హెచ్‌పీ పెట్రోల్ బంక్ వెనుక భాగం లోని వల్లభ్‌నగర్‌లో కొన్నిచోట్ల బీటీ, సీసీరోడ్లు దెబ్బతిన్నాయి. పాషాబౌలి ప్రాంతంలో అన్నీ చిన్న గల్లీలే దర్శనమిస్తాయి. ఎక్కువగా పాత ఇళ్లు, చిన్న మోరీలే దిక్కయ్యాయి. ఇక పాత పోస్టాఫీసు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద, వన్‌టౌన్ బస్టాప్ ఎదురు గల్లీ సూచిక బోర్డు మలుపులో చెత్తను చుట్టుపక్కలవారు కుప్పలుగా వేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

వర్షం వస్తే ఇబ్బందులు



ఎన్‌హెచ్-167 నిర్మించాక చుట్టుపక్కల ఇళ్లన్నీ కిందికయ్యాయి. వర్షం కురిసిందంటే మోకాలు లోతు వరద నీరు ఎక్కడికక్కడ గల్లీలలో నిలిచి పోతుంది. బురద పేరుకు పోయి కొన్ని రోజుల పాటు నడిచే పరిస్థితి ఉండదు. రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇక రోడ్లు ఊడ్చడానికి, మోరీలు తీయడానికి పారిశుద్ధ్య కార్మికులు సరిగా రావడం లేదు. కుక్కల బెడద తీవ్రంగా ఉంది. సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి.

– వెంకటేశ్వరరెడ్డి, పోస్టల్ ఉద్యోగి, బ్యాంకు గల్లీ, గణేష్‌నగర్

రక్షణ గోడ అసంపూర్తిగా

సమీపంలోనే రైల్వే ట్రాక్ ఉంది. సగం వరకు మాత్రమే రక్షణ గోడ నిర్మించి అలాగే వదిలేశారు. దీంతో చిన్నపిల్లలను బయటకు పంపించాలంటేనే భయం వేస్తుంది. మట్టిరోడ్డు కావడంతో వర్షం వచ్చిందంటే చాలు అంతా బురదమయంగా మారుతుంది. సీసీ రోడ్డు నిర్మిస్తే బాగుంటుంది. అన్నీ పాత డ్రెయినేజీలు కావడంతో మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. కొన్ని వీధి దీపాలు ఎప్పుడు వెలుగుతాయో తెలియడం లేదు.

– మహ్మద్ అన్సారీ హుస్సేన్, సోఫియా మసీదు వెనుక ప్రాంతం గల్లీ

రూ.2 కోట్లతో పనులు చేయించాం



ఈ మూడున్నరేళ్లలో రూ.2 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయించాం. గణేష్ నగర్‌లోని గల్లీలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూస్తాం. రాయిచూర్ మెయిన్ రోడ్డు పక్క నుంచి రూ.కోటితో పెద్దనాలా నిర్మిస్తాం. ఈపాటికే టెండరు ప్రక్రియ పూర్తయింది. నెల రోజుల్లో పనులు ప్రారంభిస్తాం. వార్డు పరిధిలో దెబ్బతిన్న బీటీ, సీసీ రోడ్ల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. ఈ పాటికే కొన్ని గల్లీలలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేశాం. మేడి బాయిని పూడ్చివేసి అక్కడ కమ్యూనిటీ హాలు కడుతున్నాం. ముఖ్యకూడళ్లలో 7 హైమాస్ట్ లైట్లు వేయించాం.

– జి.సంధ్య, 27వ వార్డు కౌన్సిలర్

ఎమ్మెల్యే ఇంటి ఎదుట నిరసన



అన్నాసాగర్‌లో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

భూత్పూర్ : మండలంలోని అన్నాసాగర్‌లోని ఎమ్మెల్యే ఆలవెంకటేశ్వర్‌రెడ్డి నివాసం వద్ద తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు శనివారం తెలిపారు. నిరసన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో స్పందించిన ఆయన సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, తన పరిధి వరకు విన్నవిస్తానని వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కురుమూర్తి, నాయకులు వేణుగోపాల్, నిక్సన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు పుష్పలత, లక్ష్మి, కళావతి, కవిత, విజయలక్ష్మి, గౌస్యబేగం, వరలక్ష్మి, మణెమ్మ, రాజ్యలక్ష్మి, సువరణ, సుగుణ ఉన్నారు.
జడ్చర్ల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న అంగన్‌వాడీలు శనివారం జడ్చర్లలోని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, కృష్ణ, అంగన్‌వాడీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి, సరోజ, జ్యోతి, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.
దేవరకద్ర: అంగన్‌వాడీల ధర్నాలో శనివారం బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బసిరెడ్డి సంతోష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహేందర్‌యాదవ్, మండల కమిటీ అధ్యక్షులు సత్యనారాయణసాగర్‌లు పాల్గొని మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ ప్రతినిధులు లక్ష్మి, కవిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అడ్డాకుల: రాచాలకి చెందిన భాస్కర్ అనారోగ్యంతో మృతిచెందడంతో శనివారం బీఆర్‌ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జెడ్పీటీసీ రాజశేఖర్‌రెడ్డి పంపించిన రూ.10వేలను మార్కెట్ కమిటీ సభ్యుడు చక్రపాణిరెడ్డి బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. అదేవిధంగా కందూర్‌లో మృతి చెందిన ఆకుల మైబు కుటుంబానికి రూ.5వేలను అందజేశారు. సదరు కుటుంబానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మున్నూర్ రమేష్ సైతం రూ.5వేలను అందజేశారు.

కాల్వ గండి పూడ్చివేత



అడ్డాకుల: మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు సాగునీరు వచ్చే కట్టు కాల్వకు సురాయపల్లి శివారులో గటఖానాపురంనకు చెందిన కొందరు రైతులు ఇటీవల గండికొట్టారు. దీంతో కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా పెద్ద చెరువుకు వచ్చే నీళ్లన్ని అక్కడే దిగువకు వెళ్తున్నాయి. ఈనేపథ్యంలో శనివారం అడ్డాకుల సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, రైతు బంధు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు రంగ్నగౌడ్, తిమ్మాయిపల్లి తండా సర్పంచ్ కిషన్‌నాయక్‌లు అక్కడకు వెళ్లి గండిని పూడ్చి వేయించారు. సంజీవరెడ్డి, దానేలు తదితరులు ఉన్నారు.

జడ్చర్లలో 23న గణేష్ నిమజ్జనోత్సవం



సమావేశంలో పాల్గొన్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య తదితరులు

జడ్చర్ల: పట్టణంలో ఈనెల 23న గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏటా నిర్వహించినట్లుగానే ఈసారీ ఐదు రోజుల పాటు గణేష్ ఉత్సవాలు ఉంటాయన్నారు. నిర్వాహకులకు వీహెచ్‌పీ సహకారం ఉంటుందన్నారు. కాగా ఈ ఏడాది 9 రోజుల పాటు గణేష్ ఉత్సవాలు నిర్వహించే విధంగా ఇటీవల చేసిన తీర్మానం సరైంది కాదని, తమను సంప్రదించకుండా ఎలా నిర్ణయిస్తారని మండపాల నిర్వాహకులు ప్రశ్నించారు. ఆకస్మికంగా 9 రోజులు అంటే నిర్వహణ భారం అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏకగ్రీవంగా ఐదు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించేందుకు ఆమోదించారు. ఉత్సవ కమిటీని కూడా ఏకాభిప్రాయంతో ఏర్పాటు చేసుకోవచ్చని వీహెచ్‌పీ సూచించింది. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్‌రెడ్డి, రంజిత్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, ప్రభాకర్, అశోక్‌రెడ్డి, రఘు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు తరలిన నాయకులు



రాజాపూర్ నుంచి వెళ్తున్న నాయకులు

రాజాపూర్: పాలమూరు- రంగారెడ్డి పథకంతో జిల్లా సస్యశ్యామలం అవుతుందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కొప్పరిబచ్చిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సభకు గ్రామాల నుంచి నాయకులు తరలివెళ్లారు. ఎంపీపీ సుశీల, రమేష్‌నాయక్, శ్రీశైలంయాదవ్,నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.
భూత్పూర్: సీఎం సభకు శనివారం మండలానికి చెందిన నాయకులు తరలివెళ్లారు. నియోజకవర్గ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.
హన్వాడ: మండలంలో నాయకులు, మహిళా సంఘాలు, అధికారులు ప్రత్యేక బస్సుల్లో సభకు తరలివెళ్లారు. తహసీల్దార్ కిష్టునాయక్ వాహన శ్రేణిని ప్రారంభించారు. ఎంపీపీ బాల్‌రాజు, నాయకులు లక్ష్మయ్య, కృష్ణయ్యగౌడ్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.
బాలానగర్: రాష్ట్ర జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, బాలానగర్ జెడ్పీటీసీ కల్యాణి ఆధ్వర్యంలో పలు గ్రామాల ప్రజలు తరలి వెళ్లారు. ఎంపీడీఓ కృష్ణారావు, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారి బాబురావ్ తదితరులు ఉన్నారు.
కోయిల్‌కొండ: బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయ కర్త రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి మధుసుదన్‌గౌడ్, ఎంపీడీఓ జయరాములు, బీఆర్‌ఎస్ నాయకులు శనివారం సీఎం సభకు తరలివెళ్లారు.

జాగ్రత్తలు తీసుకోవడం అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నరేష్ చంద్ర

అడ్డాకుల: టీబీ, క్షయ వ్యాధి అనుమానితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అడ్డాకుల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ చంద్ర సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శనివారం టీబీ, క్షయ అనుమానితులకు ఆయన వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, సీహెచ్‌ఓ భాస్కర్, జెడ్పీ మాజీ కోఆప్షన్ మహిమూద్ ఉన్నారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దుమృతి

రాజాపూర్: రాయపల్లిలో శనివారం సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌కు గురై గ్రామానికి చెందిన దూళ్ల కృష్ణయ్య ఎద్దుమృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కిందకు ఉండటంతో ఘటన చోటుచేసుకుందని రూ. 60వేల నష్టం వాటిల్లిందని ఘటనను చూసిన రైతులు తెలిపారు. విద్యుత్‌శాఖ నిర్లక్ష్యమే కారణమన్నారు. కృష్ణయ్యను ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జడ్చర్ల: మాచారం సమీపంలో 44వ నంబర్ జాతీయరహదారిపై శనివారం మోటర్ బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టి వెళ్లింది. ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో ఒకరిని కూచూరుకు చెందిన కరుణాకర్‌రెడ్డిగా గుర్తించారు. చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జడ్చర్ల: తంగెళ్లపల్లికి చెందిన బీజేవైఎం మండల శాఖ అధ్యక్షుడు వెంకటేష్‌పై అదే గ్రామానికి చెందిన దుండగులు దాడిచేశారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు తిరుపతి డిమాండ్ చేశారు. శనివారం వెంకటేశ్‌ను పరామర్శించారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకే ఆయనపై దాడికి పాల్పడ్డారని తెలిపారు.

ఓట్ల కోసమే పూర్తికాని ప్రాజెక్టు ప్రారంభం

స్టేషన్ మహబూబ్‌నగర్: రానున్న ఎన్నికల్లో ఓట్ల కోసమే సీఎం కేసీఆర్ పూర్తికాని పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభించారని అసెంబ్లీ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జె.చంద్రశేఖర్ విమర్శించారు. శనివారం సీఎం పర్యటనలో నేపథ్యంలో పలువురు యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్లకు తరలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.
భూత్పూర్: ప్రభుత్వం నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం తగదని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ అన్నారు. సీఎం కేసీఆర్ కొల్లాపూర్ పర్యటనలో భాగంగా శనివారం తెల్లవారుజామున పోలీసులు వారిని ముందస్తుగా అరెస్టు చేయడం చేశారు. టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాధిక్, మాజీ సర్పంచులు హర్యానాయక్, నాగిరెడ్డి, బీజేపీ నాయకులు అరెస్టయిన వారిలో ఉన్నారు.
మిడ్జిల్: మండల కాంగ్రెస్ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచారు. వీరిలో మండల అధ్యక్షుడు, నాయకులు ఉన్నారు.

ఉత్సాహంగా అర్బన్ ఎస్‌జీఎఫ్ క్రీడలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ప్రధాన స్టేడియంలో శనివారం మహబూబ్‌నగర్ అర్బన్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. అండర్- 14, 17 విభాగాల బాల, బాలికలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ సెలక్షన్స్ జరిగాయి. క్రీడాపోటీల్లో ముఖ్య అతిథిగా ఎంఈఓ జయశ్రీ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, అర్బన్ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శ్రీనివాసులు, పీఈటీలు సాదత్‌ఖాన్, బాలరాజు, రామేశ్వరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ముస్తఫా, రాజు, దత్తాత్రేయ, మేరిపుష్ప, గీత, అరుణజ్యోతి, శైలజ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



పోషణ మాసోత్సవంలో పాల్గొన్న గర్భిణులు, బాలింతలు

మహబూబ్‌నగర్ రూరల్/ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ : పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సీడీపీఓ కె.రాజేశ్వరి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎదిర సెక్టార్ పరిధిలో శనివారం నిర్వహించిన పోషణ మాసోత్సవాలలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ భోజనంలో ఆకుకూరలు, పాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ నరేందర్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆంజనేయులు, రైతుబంధు అధ్యక్షుడు సురేందర్, అంగన్‌వాడీ టీచర్లు యాదమ్మ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

దైవభక్తి పెంపొందించుకోవాలి



అడ్డాకుల: మండల కేంద్రంలో శనివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగించారు. ఇందూ జ్ఞానవేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భజనలు, కోలాటాలతో జయజయ ధ్వానాల మధ్య కార్యక్రమం చేపట్టారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, సభ్యులు పురుషోత్తం, బాలకృష్ణ, శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, కృష్ణ, మాసన్న పాల్గొన్నారు.

యువతుల అదృశ్యం

రాజాపూర్: ఇబ్రహీంపల్లికి చెందిన ఓ యువకుడికి గత నెల 20న భూత్పూర్ మండలం గోప్లాపూర్‌కి చెందిన యువతితో వివాహం జరిగింది. కాగా ఆమె శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. విషయాన్ని యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వగా అక్కడికి కూడా రాలేదని వారు తెలిపినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.
చిన్నరేవల్లిలో..
బాలానగర్ మండలం చిన్నరేవల్లికి చెందిన ఓ యువతి షాద్‌నగర్‌లో డిగ్రీ చదువుతోంది. శుక్రవారం రాత్రి కుటుంబ సభ్యులందరూ పడుకున్నాక ఇంట్లోంచి ఎక్కడికో వెళ్లిపోయింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె కుటుంబసభ్యులు శనివారం ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో ఏబీవీపీ నాయకులు మెట్టుగడ్డ నుంచి తెలంగాణ చౌరాస్తా వరకు రాల్యీ నిర్వహించారు. కార్యవర్గ సభ్యులుస్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.
జడ్చర్ల టౌన్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. 200 అడుగుల జెండాతో 500 మంది విద్యార్థులతో కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సతీష్ పాల్గొని ప్రసంగించారు. నాయకులు మణి, శివ, మారుతి, సాయి, వీరమోహన్, పూర్ణ, భాగ్య, రాజేశ్వరి, తేజ తదితరులు పాల్గొన్నారు.
భూత్పూర్: తెలంగాణ విమోచన దినాన్ని ప్రభుత్వం అధికారంగా నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మచారి అన్నారు. శనివారం భూత్పూర్ చౌరస్తా నుంచి సీసీ కుంటలోని అప్పంపల్లి అమరవీరుల స్థూపం వరకు చేపట్టిన మోటర్ సైకిల్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.సుదర్శన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సదానంద్, పట్టణ శాఖ అధ్యక్షుడు రవీందర్, మండలశాఖ అధ్యక్షుడు రాంరెడ్డి, పట్నం శ్రీను, ప్రశాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.
చిన్నచింతకుంట: తెలంగాణ విమోచన దినాన్ని పురస్కరించుకొని శనివారం భూత్పూర్ నుంచి అప్పంపల్లి అమరవీరుల స్థూపం వరకు బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేప్టారు. అమరవీరులకు నివాళి అర్పించారు. బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు పద్మజారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సింహులు, బాలమన్నెమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శులు నంబిరాజు, మాధవరెడ్డి, అసెబ్లి కన్వీనర్ కుర్వరమేష్, మండల అధ్యక్షుడు దశరథ్ తదితరులు పాల్గొన్నారు.
మిడ్జిల్: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు నరేందర్, తిరుపతి, అంజి, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.